టైరుపేలి డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఐదుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని వెల్గనూరు గ్రామ శివారులోని జాతీయ రహదారి పై ప్రయాణిస్తున్న కారు టైరు పేలి డివైడర్‌ను ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన కుటుంబం మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్తుండగా వెల్గనూరు గ్రామ శివారులోకి రాగానే కారు ముందటి టైర్ పేలడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జాతీయ రహదారి సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని వారిని సమీప ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదానికి గురైన కారు

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి



నవతెలంగాణ-రెంజల్

రోజు రోజుకు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతూ ఉండడంతో, రెంజల్ మండలంలోని రైతులు కూరగాయ సాగుపై ఆసక్తిని కనబరుస్తున్నారు. మండలంలోని నీలా, పేపర్ మిల్, నీలా క్యాంప్, కందకుర్తి గ్రామాలలో రైతులు కూరగాయ సాగుపై ఆసక్తిని కనబరుస్తున్నారు. ఇటీవల కూరగాయల ధరలు పెరుగుతూ ఉండడంతో రైతులు ఈ పంటల వైపు దృష్టిని సారించారు. మండలంలో సుమారు 200 ఎకరాలలో కూరగాయ సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. వంకాయ, టమాట, గోపి, బెండకాయ, కాకరకాయ, పచ్చిమిరప కాయ లతోపాటు, ఆకుకూరలైన పాలకూర, చుక్కకూర, మెంతం కూరగాయలను, ఆకు కూరలను పండించడంతో అధిక లాభాలు వస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవల బోధన్ ఎమ్మెల్యేపి. సుదర్శన్ రెడ్డి కూరగాయ సాగు పై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆసక్తి గల రైతులకు సబ్సిడీ పైన విత్తనాలను ఎరువులను అందజేస్తుందని తెలపడంతో రైతులు దృష్టి సారించారు.

నేరాలు.. దారుణాలు



- గతేడాదితో పోలిస్తే పెరిగిన నేరాల సంఖ్య
- చోరీ, మోసాలు, సైబర్ క్రైమ్ కేసుల్లో పెరుగుదల
- మహిళలపై దాడులు తగ్గినా.. చిన్నారులపై పెరిగిన ఘోరాలు
- రోడ్డు ప్రమాదాల్లో పలు కుటుంబాలకు కన్నీటిగోస
- లోక్ అదాలత్‌లో 4,422,29 కేసులు పరిష్కారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏటికేడు క్రైమ్ రేట్ పెరుగుతోంది. నిత్యం ఏదో ఒక ఘటన చోటుచేసుకుంటున్నాయి. ఒక వైపు హత్యలు, మరోవైపు లైంగికదాడులు, వేధింపులు.. వీటితో పాటు ఇంట్లో చొరబడి దొంగతనాలు.. ఇలా వివిధ పద్ధతుల్లో కేసుల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయి. వీటతో పాటు కిడ్నాప్, మిస్సింగ్, వైట్ కాలర్ నేరాలు సంఖ్య పెరిగాయి. మహిళలపై వేధింపుల కేసులు తగ్గినా బాలికలు, చిన్నారులపై లైంగికదాడులు పెరిగాయి. ఒక వైపు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నా.. మరోవైపు నేరాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. రోడ్డు ప్రమాదాల రూపంలో పలు కుటుంబాలకు శోకం తప్పలేదు. కొత్తకొత్త రూపాల్లో మోసాలకు తెరతీస్తుండటంతో ఈసారి సైబర్ క్రైమ్‌ల కేసులు సైతం ఎక్కువ సంఖ్యలో పెరిగాయి. ఇక ఫిర్యాదు చేయని కేసులకైతే లెక్కేలేదు. ఈసారి లోక్ అదాలత్‌తో 4,42,229 కేసులను పరిష్కరించారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి ఈ ఏడాది నమోదు చేసుకున్న క్రైమ్‌లకు సంబంధించి వార్షిక నివేదికను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ మాట్లాడుతూ.. 2024 సంవత్సరంలో మొత్తంగా 8745 ఎఫ్ఐఆర్ లు నమోదయాయని గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 110 ఎఫ్ఐ ఆర్ లు ఎక్కువగా నమోదయ్యాయి.

ఐపిసి కేసులు

ఐపిసి కేసెస్‌లో బాడీ అఫెన్సెస్ కింద మొత్తం 2024లో 1185 కేసులు నమోదయ్యాయి. ఇందులో గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం కిడ్నాపింగ్ 57 కిడ్నాప్ కేసులు ఉండగా 2023లో 24 ఉన్నాయి. గత సంవత్సరాలతో పోలిస్తే హెూం సైడ్, కిడ్నాపింగ్, రేప్, హాట్ కేస్లు ఎక్కువగానే నమోదయ్యాయి. మర్డర్, అటెం టు మర్డర్, రియోటింగ్ వంటివి గత సంవత్సరం పోలిస్తే ఈ సంవత్సరం తగ్గాయి.

ప్రాపర్టీస్ అపెన్స్ కేసులు..

ప్రాపర్టీ అఫెన్సెస్లో, మర్డర్ ఫర్ గేమ్ ఆరు కేసులు నమోదు కాగా 6 కేసులను ఛేధించారు. రాబరీ కేసులు 2023తో పోలిస్తే ఈ సంవత్సరం పెరిగాయి. కేసులు ఎలా పెరిగాయో చేదించడం కూడా తొందరగానే కేసులను ఛేదించడం జరిగింది. సంవత్సర కాలంలో మొత్తంగా ఏడు శాతం ప్రాపర్టీ అఫెన్సెస్ పెరిగాయి. ప్రాపర్టీ అఫెన్సెస్ కేసులలో 2024 సంవత్సరంలో మొత్తంగా 8 కోట్ల 44 లక్షల 33, 882 సోత్తును దొంగిలించగా రెండు కోట్ల రెండు లక్షల 13,464 నగదును రికవరీ చేశారు.

ఉద్యోగాల పేరిట ఐరిడీ

ఉద్యోగాల పేరిట చీటింగ్ కేసులు (వైట్ కాలర్) పెరుగుతూనే వస్తున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 82 కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. 2023లో మొత్తం 661 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 743 నమోదు అయ్యాయి.

రోడ్డు ప్రమాదాల్లో 335 మంది మృతి

రోజురోజుకు రోడ్డు ప్రమాదాలపై పోలీస్ శాఖ ద్వారా అవగాహన కల్పించినప్పటికీ పెరుగుతూనే ఉన్నాయి. గత సంవత్సరం 312 కేసులు కాగా ఈ సంవత్సరం 322 కేసులలో 335 మంది మరణించారు. మిగతా రోడ్డు ప్రమాదాల్లో 509 కేసుల్లో 758 మంది గాయాల పాలయ్యారు. రోడ్డు ప్రమాదాలు గత సంవత్సరంతో పోలిస్తే మృతుల సంఖ్య 12 శాతానికి పెరగగా, గాయపడిన ఘటనలు 3.20 శాతం పెరిగాయి.

కొత్త రూపాల్లో సైబర్ నేరాలు..

సైబర్ నేరాలు సైతం రోజురోజుకు పెరుగుతూనే వస్తున్నాయి. ఒక అంశంపై అవగాహన కలిగి మోసపోకుండా ప్రజలు జాగ్రత్త పడుతుండగా.. మరో కొత్త రూపంలో సైబర్ మోసాలకు గురవుతున్నారు. కాగా ఫిర్యాదు చేసేందుకు చాలా మంది వెనకడుగు వేస్తుండటంతో.. ఏ రకమైన మోసాలకు గురవుతున్నారో బయటకు తెలియకుండా పోతోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. సదరు ఘటనపై అవగాహన కల్పించే అవకాశం ఉంటుంది. కాగా 2022 సంవత్సరంలో 192, 2023 సంవత్సరంలో 294 కేసులు నమోదు కాగా.. 2024లో ఏకంగా 376 కేసులు నమోదయ్యాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 82 కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. పోలీస్ శాఖ తరపున అవగాహన కార్యక్రమాలను రోజువారీగా నిర్వహిస్తూ ఎక్కడికక్కడ చర్యలు తీసుకుంటున్నా మోసాలు మాత్రం ఆగడం లేదు.

మహిళలపై దాడులు

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం మహిళలపై దాడులు, లైంగిక దాడులు, హత్యలు, వేధింపుల కేసులు కొద్ది మేర తగ్గుముఖం పట్టాయి. గత సంవత్సరం 353 వరకట్న వేధింపుల కేసులు కాగా ఈ సంవత్సరం 326 కేసులు మాత్రమే అయ్యాయి. డౌరీ హత్యలు గత సంవత్సరం నాలుగు కాగా ఈ సంవత్సరం మూడు చోటుచేసుకున్నాయి. ఇవ్ టీజింగ్ కేసులు గత సంవత్సరం 68 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 50 కేసులు నమోదయ్యాయి.

ఆడపిల్లలపై ఘోరాలు

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఫోక్సో యాక్ట్ కేసులు పెరిగాయి. బాలికలకు, చిన్నారులకు మాయమాటలు చెప్పి లైంగికదాడులు చేస్తున్న ఘటనలు పెరుగుతుండటం ఆందోళనకరం. గత సంవత్సరం 81 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 115 కేసులు నమోదయ్యాయి. పోక్సో ఆక్ట్ కేసులలో 34 కేసులు పెరిగాయి.

ఇతరాత్ర కేసులు..

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద మొత్తంగా 101 కేసులు నమోదు అయ్యాయి. గతేడాది కంటే 4 కేసులు పెరిగాయి.
- ఈ-చాలన్ కింద మొత్తం 3,04,914 వాహనాలపై రూ.11.40 కోట్ల ఫైన్ వేశారు. డ్రంకెన్‌డ్రైవ్ కింద 7698 మందిపై కేసులు నమోదు కాగా రూ.88.90 లక్షల ఫైన్ వేయగా.. 165 మందికి జైలు శిక్ష విధించారు.
- మిస్సింగ్ కేసుల్లో 873 కేసుల్లో 984 మంది అదృశ్యం కాగా వీరిల్లో 846 మందిని ట్రేస్ చేయగా.. 138 మంది వివరాలు తెలియరాలేవు. గతేడాదితో పోలిస్తే 139 కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయి.
- డయల్ యువర్ 100కు మొత్తం 61606 కాల్స్ రాగా.. వాటిల్లో 3203 ఫేక్ కాల్స్ వచ్చాయి.
- పాస్‌పోర్టుల కోసం 50,095 దరఖాస్తులు రాగా.. వాటిల్లో విచారణ చేపట్టి 48,882 పాస్‌పోర్టులకు క్లియరెన్స్ ఇచ్చారు.

జనవరి 25 నుంచి సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు

- తొలిరోజు బహిరంగ సభను జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు పిలుపు



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు వచ్చే నెల జనవరి 25వ తేదీ నుంచి సంగారెడ్డి పట్టణంలో జరగనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. 25 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాల యంలో మహాసభల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. పార్టీ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలపై జరిగిన ఉద్యమాలను సమీక్షించుకోవడంతోపాటు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ఈ రాష్ట్ర మహాసభల్లో నిర్ణయించనున్నట్టు తెలిపారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన ప్రధానంగా నిరు ద్యోగ సమస్య పరిష్కారంలో, రైతాంగ వ్యవసాయ చట్టాల మార్పుకు నిరసనగా, అదేవిధంగా కార్మిక చట్టాలలో తెచ్చిన మార్పులను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఇంకా అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని బిజెపి అనుసరించే ప్రజా సమస్యల పైన, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు రాజ్యాంగ హక్కుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అ హామీల అమలు కొరకు ఈ మహాసభలో చర్చించుకుని ఉద్యమ కార్యాచరణను రూపొందించు కోనున్నట్టు తెలిపారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలలో మహాసభలు జయప్రదం కోసం ప్రజలు పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందిస్తున్నారని 25న జరిగే బహిరంగ సభకు జిల్లా ప్రజానీకం పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు సీపీఐ(ఎం) అఖిలభారత నాయకులు ప్రకాష్ కరత్, బీవీ రాఘవులు, ఇతర కేంద్ర నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొని తమ సందేశాలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎం.గంగాధరప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, ఐద్వా నాయకులు సుజాత పాల్గొన్నారు.

కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే

తనపై, కేటీఆర్‌పై అక్రమ కేసులు

- పేరు మర్చిపోయినా, రైతులు భూములు ఇవ్వకపోయినా కేసులు పెడుతున్న సీఎం రేవంత్
- నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను దేనికీ భయపడను
- హామీలు అమలు చేయని పాలకులను ఎక్కడికక్కడ నిలదీయండి : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



మాట్లాడుతున్న కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

అటు కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. కేసులు పెడుతున్నారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము ధైర్యం లేక తపై, కేటీఆర్‌పై ఇరు ప్రభుత్వాలు అక్రమ కేసులు బనాయిస్తున్నాయని ధ్వజమెత్తారు. పేరు మర్చిపోయినా, రైతులు భూములు ఇవ్వకపోయినా సీఎం రేవంత్ కేసులు పెడుతున్నా రని, ఆ తీరు సరికాదని అన్నారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను అని, దేనికీ భయపడను అని అన్నారు.

మద్యం పాలసీ కేసులో అరెస్ట్, బెయిల్‌పై విడుదల, న్యాయ పోరాటం వంటి పరిణామాల నేపథ్యంలో సుదీర్ఘ కాలం తరువాత ఆదివారం నిజామాబాద్‌కు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. నగరంలోని సుభాష్ నగర్‌లో గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా పిడికిలి ఎత్తి అన్ని ఎదు రించి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చా నని తెలిపారు. తమది భయపడే రక్తం కాదని భయపెట్టే రక్తం అని అన్నారు. తాము తప్పు చేయలేదు కాబట్టి భయపడే ప్రసక్తే లేదు అని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పు కణికల్లా బయటికి వస్తారని, రాష్ట్రంలో అక్రమ కేసులపై గురించి చెప్పనవసరం లేదని అన్నారు.

'తెలంగాణ తల్లి స్థానంలో కాంగ్రెస్ మాతను ఏర్పాటు చేశారు. మన పొట్టమీదనే కాదనీ మన సంస్కృతిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తున్నది. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తే లేదన్నారు. మళ్లొకసారి నిజామాబాద్ పవర్ ను సీఎం రేవంత్ రెడ్డికి రుచి చూపిద్దాం' అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







కంఠేశ్వర్ చౌరస్తా వద్ద సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు.. స్వాగతం పలుకుతున్న 44వ డివిజన్ ఇన్‌చార్జి శివకుమార్.. డిచ్‌పల్లి : గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

అణచివేతలపై న్యాయ, ప్రజాక్షేత్రంలో పోరు

- మరణానంతరం ఆదర్శాన్ని చూపిన యోధుడు గొర్రెపాటి మాధవరావు
- సంతాపసభలో పలువురు వక్తలు
- గొర్రెపాటి మాధవరావు భౌతికకాయం వైద్యకళాశాలకు అప్పగింత



జోహార్లు అర్పిస్తున్న నాయకులు



తుది వీడ్కోలు పలుకుతున్న కుటుంబీకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

హక్కులు హరించి వేయబడుతున్నప్పుడు, బలహీనులను అణచివేస్తున్నప్పుడు, రాజ్య హింస పెరుగుతున్నప్పుడు బాధితుల గొంతుకై గొర్రెపాటి మాధవరావు నిలిచారని, వారి కోసం న్యాయ క్షేత్రంలోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం చేశారని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పోటు సూర్యం కొనియాడారు. మరణంలోనూ ఇలాంటి ఆదర్శాన్ని ప్రదర్శించిన గొర్రె పాటి మాధవరావు అందరికీ ఆదర్శమని అన్నారు. ప్రముఖ మానవ హక్కుల నాయకుడు, సీనియర్ అడ్వకేట్, మేధావి గొర్రెపాటి మాధవరావు శనివారం ఉదయం మరణించిన సంగతి తెలిసిందే. ఆదివారం ఉదయం 10 గంటలకి ఆయన భౌతికకాయాన్ని స్వగృహం నుంచి సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయం నీలం రామచంద్రయ్య భవన్‌కు తరలించి న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఆయన జీవితాంతం అణచివేయబ డుతున్న వారి గొంతుకై నిలిచాడని అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా న్యాయవ్యవస్థలోను, సామాజిక వ్యవస్థలోనూ పోరాటం చేశారని కొనియాడారు. 'అపారమైన తన మేధో శక్తిని అసమానతలకు వ్యతిరేకంగా పనిచేయడానికి వాడారు. అన్యాయాలను ప్రశ్నించడానికి ఉపయో గించాడు. పదునైన మాట, బలమైన రచన రెండు గొర్రెపాటి మాధవరావు సొంతం అన్నారు. ఆ రెండింటిని కేవలం తన కోసం కాకుండా సమాజం కోసం వాడారని కొనియాడారు. అంత గొప్ప మేధాశక్తి కలిగిన వ్యక్తిని కోల్పోవడం ప్రజా ఉద్యమాలకు, హక్కుల ఉద్యమాలకు, పేద , బడుగు బలహీనర్గాలకు తీరనిలోటని అన్నారు. నిజామా బాద్ జిల్లాలో ఒక మేరు నగధీరుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తన మరణం లోను ఆదర్శాన్ని చూపుతూ తన భౌతిక కాయాన్ని విద్యార్థుల పరిశోధనార్థం మెడికల్ కళాశాలకు అప్పగించాలని ఆయన కుటుంబ సభ్యులకు కోరడం చాలా గొప్ప ఆదర్శమని అన్నారు. గతంలోనూ నిజామాబాద్ జిల్లాలో అనేకమంది ఉద్యమ నాయకుల వారి కుటుంబ సభ్యుల భౌతిక కాయాలను మెడికల్ కళాశాలకు అప్పగించేలా కృషి చేసిన వ్యక్తి గొర్రెపాటి మాధవరావు అని అన్నారు. తన భౌతిక కాయాన్ని కూడా అలాగే అప్పగించాలని కుటుంబానికి ముందే చెప్పడం ఆయన ఆదర్శానికి నిదర్శనం అన్నారు. బతికున్నప్పుడే కాదు మరణం లోను ఇంతటి ఆదర్శం చూపడం చాలా గొప్ప విషయం అన్నారు. ఆయన నేత్రాలను లయన్స్ క్లబ్ వారికి అందజేశారు.

సంతాప సభ అనంతరం కోటగల్లిలోని పార్టీ కార్యాలయం నుండి మార్కండేయ మందిర్, వీక్లీ బజార్, ముదిరాజ్ గల్లి గుండా ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు భారీ ఊరేగింపుతో దారిపొడవునా మానవ హక్కుల నేత అమర్ రహే! పేదల పక్షపాతి అమర్ రహే! అంటూ నినాదిస్తూ కళాశాలకు చేరుకున్నారు. అనాటమీ డిపార్ట్ మెంట్ ప్రొఫెసర్ సుమలత మాట్లాడుతూ ఇంత మంది ప్రజలు వచ్చారంటేనే ఆయన ఎంత గొప్ప వ్యక్తో అర్థం అవ్వుతుందన్నారు.

అనంతరం కుటుంబ సభ్యులు మాధవ రావు సహచారిని మీనా సహాని, కూతురు మధుమిత, వారి అన్నదమ్ములు జగన్ మోహన్, లీల ప్రసాద్ , శరత్ చంద్ర, రామకృష్ణ , యోగ నంద్, లు మరియు న్యూడెమోక్రసీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మానవ హక్కుల వేదిక నాయకుల ఆధ్వర్యంలో భౌతిక కాయాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, మాజీ ఎంఎల్ఏ మండవ వెంకటేశ్వరరావు, హెచ్ ఆర్ ఎఫ్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వి ఎస్ కృష్ణ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భుజంగ రావు, తిరుపతయ్య, న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధి పి ప్రసాద్, సాధినేని వెంకటేశ్వర్లు, పి ఓ డబ్ల్యు జాతీయ నాయకులు ఝాన్సీ, సంధ్య, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ రిక్క లింబాద్రి, మాజీ రిజిస్ట్రార్ వినాయక్ రెడ్డి, ప్రో వినయ్ బాబు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, టి పి టి ఎఫ్ మాజీ నాయకులు హన్మండ్లు, సి ఎల్ సి నాయకులు లింగం, జోస్న లు ప్రసంగిం చారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, వామపక్ష పార్టీల నాయకులు వెల్పూర్ భూమయ్య, పరుచూరి శ్రీధర్, గంగులు, సరిత, వనమాల కృష్ణ, రమేష్ బాబు పాల్గొన్నారు.





ప్రభుత్వ మెడికల్ కాలేజీకి భౌతికకాయాన్ని అప్పగించేందుకు అంతిమయాత్రలో జోహార్లు అర్పిస్తున్న నాయకులు.. సంతాప సభలో మాట్లాడుతున్న మండవ

నేడు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ సమన్వయ సమావేశం

- ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ కాలేజీల ప్రిన్సిపాల్స్ హాజరు కావాలి : డీఐఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు,ఎయిడెడ్ ఇతర అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లతో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు అన్ని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లతో కలెక్టర్ సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రిన్సిపాల్‌లు అందరు హాజరు కావాలని సూచించారు.. సమావేశంలో ఇంటర్ విద్యార్థులకు మానసిక సంసిద్ధతను పెంపొందించేందుక, విద్యార్థుల్లో ఆంటీ డ్రగ్స్, ఆత్మహత్యల నిరోధించేందుకు, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, రానున్న వార్షిక పరీక్షలకు సంసిద్ధం చేయడం పై ఈ సమీక్షలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

డీటీయు జిల్లా కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలో డిటీయు ప్రతినిధుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో డిటియు జిల్లా కమిటీని రాష్ట్ర కమిటీ బాధ్యులు నాగేశ్వర్ రావు, రాజు ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గుమ్మడి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్ది సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షులుగా గద్దల రమేష్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా నలూరి రాజమణి, జిల్లా కార్యదర్శులుగా గద్దల సాయినాథ్, ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మోహన్, పోషన్న, శంకర్, రాజన్న, మోహన్, వినోద్, సుధాకర్, సురేష్, రాజ్ కుమార్ కమిటీ సభ్యులుగా ఎన్నున్నారు. కార్యక్రమంలో డిటీయు ప్రతినిధులు నాగేశ్వర్ రావు, చంద్ర శేఖర్, సుదర్శన్, రమేష్, సాయినాథ్, రాజు, వినోద్, సురేష్, ఉద్యోగ బాధ్యులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అపురూప కలయిక... అయ్యింది వేడుక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



పూర్వ విద్యార్థుల అపురూప కలయిక.. ఓ వేడుకయ్యింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఇందుకు ఓ ప్రైవేట్ బంకిట్ హాల్ వేదికయ్యింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో దూర ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులంతా ఉత్సాహంగా హాజరయ్యారు. మూడు పదుల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. గ్రూపు ఫొటోలు దిగి, అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుముందు తాము చదివిన పాఠశాలను అంత కలిసి సందర్శించారు. తరగతి గదుల్లో తిరుగుతూ పాత జ్ఞాపకాలను, విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు.

కార్యదర్శులపై ఇందిరమ్మ ఇళ్ల సర్వే భారం

- మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు
- సెలవు దినాల్లో సైతం సర్వే
- మొరాయిస్తున్న సర్వర్



పంచాయతీ కార్యదర్శి, కారోబార్ సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీఓ కిరణ్ కుమార్

నవతెలంగాణ-మోపాల్

గ్రామాల్లో సర్పంచులు లేక సమస్యలను పట్టించుకునే వారు లేరు. మరోపక్క కార్యదర్శులే అన్ని పనులు చూసుకుంటున్నారు. వీటికి తోడు ఇందిరమ్మ ఇండ్ల సర్వేతో జీపీ కార్యదర్శుకు పనిభారం పెరిగి ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు సర్వేవల్ల ఉన్నతాధికారులతో ఒత్తిడి మరోవైపు సర్వర్ సమస్యతో సర్వే ఆలస్యం అవుతూ మరింత ఒత్తిడికి లోనవుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపికలో చేపట్టిన సర్వే పంచాయతీ కార్యదర్శులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక దిక్కున గ్రామపంచాయతీకి సర్పంచులు లేకపోవడంతో పరిశుభ్రత, మంచినీటి సమస్యలు, ట్యాక్స్ వసూలు వంటి పనులు చేస్తున్నారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపిక విషయంలో కూడా తీవ్రమైన ఒత్తిడికి లోను కావాల్సి వస్తుంది. సమయం తక్కువ పని ఎక్కువ అన్న రీతిలో వారి పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఖాళీ జాగాలు, గుడిసెలు, పెంకుటిల్లు ఉన్నవారే కాకుండా కాంక్రీట్ బిల్డింగులతో పక్కా ఇండ్లు ఉన్న వాళ్లు కూడా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దాదాపు రెండు మూడు అంతస్తుల ఇల్లు ఉన్న వారు కూడా మళ్లీ ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.. కార్యదర్శులు మీకు ఇంత పెద్ద ఇల్లు ఉంది కదా ఎందుకు అప్లై చేసుకున్నారని వారిని అడిగితే వారి పైన తీవ్రమైన పదజాలంతో విమర్శిస్తున్నారు. మీరు ఇవ్వట్లేదు కదా ప్రభుత్వం ఇస్తుంది కదా.. మాకు మరో దగ్గర ఖాళీ జాగా ఉంది.. ఇంకో ఇల్లు కట్టుకుంటామని పంచాయతీ కార్యదర్శులను దబాయిస్తున్నారు.... పంచాయితీ కార్యదర్శుల పరిస్థితి," ముందు నుయ్యి వెనుక గొయ్యి లాగా ఉంది. దానితోపాటు రాజకీయ ఒత్తిళ్లు మళ్లీ, అంతేకాకుండా కొందరికి కాళీ జాగా ఉండి కూడా వాటికి సరైన పత్రాలు లేక వాటిని గుర్తించడంలో కూడా సతమతమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80.54 లక్షలకు ఐదు రోజుల క్రితం వరకు 45 లక్షల పైబడి అప్లికేషన్లు వెరిఫై చేయగా అందులో రెండు లక్షలకు పైగా పక్కా ఇల్లు ఉండి కూడా మళ్లీ అప్లై చేసుకున్నవారు ఉన్నారు. అదేవిధంగా 4.5 లక్షల మంది రేకుల ఇండ్లలో రెండు లక్షల మంది పెంకుటిండ్లలో ఉంటున్నట్టు ఇప్పటివరకు జరిగిన సర్వేలో ప్రభుత్వం గుర్తించింది. మొదటి దశలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వ మంజురు చేసింది. ఇంటి నిర్మాణం కోసం వివిధ దశల్లో కలిపి 5 లక్షల రూపాయలను ప్రభుత్వ సహాయం కింద అందించనుంది. ముఖ్యంగా దారిద్ర రేఖకు దిగువనున్నవారికి మొదటి దఫాగా ఇందిరమ్మ ఇల్లును కేటాయిస్తామని ప్రభుత్వం చెప్తుంది.

ఆలస్యం అవుతున్న సర్వే..

గ్రామీణ ప్రాంతాల్లో సర్వే చేయడానికి పంచాయతీ కార్యదర్శులు వెళ్లగా కొందరు జిల్లా కేంద్రంలో ఉండడం, సరైన సమయంలో వారు తమ గ్రామానికి రావడంలేదు. అంతేకాకుండా ఇప్పుడు రబీ పంట పొలం పనులు ప్రారంభం కావడంతో చాలామంది ఇండ్లలో ఉండకపోవడంతో ఒక కార్యదర్శి ఓకే ఇంటికి దాదాపు నాలుగు నుండి ఐదు సార్లు వెళ్లాల్సి వస్తుంది. సంక్రాంతి వరకు సర్వే పూర్తి కావడం మాత్రం చాలా కష్టం. అంతేకాకుండా ఒక దరఖాస్తు దారుని ఇంటికి వెళ్లి ఫోటోలు తీసి వివరాలన్నీ అప్లోడ్ చేయడానికి ఒకరికి కనీసం 30 నిమిషాలకు పైగా సమయం పడుతుంది. ఒక్క కార్యదర్శి రోజులో 20 నుండి 30 దరఖాస్తులకు మించి చేయడమే అతి కష్టంగా ఉంది. మొబైల్ యాప్‌లో నాలుగు పేజీలు ఉన్నాయి. ప్రతి పేజీ నింపి ఇల్లు జాగా ఫొటో, ఇంటి స్థలం పేపర్లు, ఇంటి పన్నుల రసీదులు అప్లోడ్ చేస్తున్నారు. అంతేకాకుండా అద్దెకుండే వాళ్ళు, వికలాంగులు, తల్లిదండ్రులు లేకుండా ఒంటరిగా జీవించేవాళ్లు, సింగిల్ ఉమెన్, ట్రాంజెండర్లు, సఫాయి కార్మికులు, రోడ్డు వెడల్పులో మరియు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇండ్లు కోల్పోయిన వాళ్ళ వివరాలను ప్రత్యేకంగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా అర్హులను గుర్తించేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సిజిజి) సహకారంతో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ రెడీ చేసింది. కానీ ఈ యాప్‌ను ఒకేసారి అందరూ ఉపయోగించడం వల్ల సర్వర్ సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల పని ఇన్ని సంవత్సరాలు ఒకలాగా, ఇందిరమ్మ సర్వేతో మాత్రం మరో రకంగా మారింది. శారీరకంగా మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మోపాల్ మండలంలో 9259 ఇందిరమ్మ అప్లికేషన్లు రాగా ఇప్పటివరకు 6,540 పూర్తయినట్టు ఎంపీడీవో రాములు నాయక్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల పని ఒత్తిడిపై వారిని అడగగా కొన్ని చిన్న గ్రామపచాయతీల సర్వే పూర్తయితే వారిని పెద్ద గ్రామపంచాయతీలకు కేటాయిస్తూ వారి సర్వే భారాన్ని తగ్గిస్తున్నారు. కొంచెం పని భారం ఎక్కువైనా కూడా నిక్కచ్చిగా సర్వే చేయిస్తున్న అనుక్షణం కూడా సర్వేను పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు.

చలో నల్గొండ జయప్రదం చేయండి

- సిపిఐ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చలో నల్గొండ జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ నగర కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, పేద, ధనిక తేడా లేని సమ సమాజ స్థాపన కోసం ఏర్పడిన సిపిఐ పార్టీ భారతదేశంలో కార్మిక వర్గాన్ని, మహిళలను, విద్యార్థులను, యువకులను ఐక్యం చేసి చట్టాలను సాధించిన పార్టీ అన్నారు. ప్రధానంగా తెలంగాణ ప్రాంతంలో నిజాం వ్యతిరేక పోరాటం నిర్వహించి భూస్వాముల మెడలు వంచి పది లక్షల ఎకరాల భూమి పంచి పెట్టిన కమ్యూనిస్టు పార్టీ 4000 మంది కార్యకర్తల ప్రాణాలను త్యాగం చేసిందన్నారు. ఇటువంటి చారిత్రాత్మకమైన పార్టీ శత జయంతి ఉత్సవాల ప్రారంభ సూచికంగా నల్గొండలో జరిగే బహిరంగ సభలో పార్టీ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అలీ ఇమ్రాన్, సఖి సురేష్, కె. గంగాధర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

అవయవదాతల, శరీర దాతలకు గౌరవ ప్రస్థానం ఉండాలి

- మట్టిమనిషి వెనెపల్లి పాండురంగారావు



మాట్లాడుతున్న మట్టిమనిషి వెనెపల్లి పాండురంగారావు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అవయవదాతల, శరీర దాతలకు గౌరవ ప్రస్థానం ఉండాలని మట్టిమనిషి వెనెపల్లి పాండురంగారావు అన్నారు. నిజామాబాద్‌లో ప్రముఖ న్యాయవాది మానవ హక్కుల నాయకుడు కమ్యూనిస్ట్ పీడితుల, బాధితుల గొంతుక గొర్రెపాటి మాధవరావు, డెడ్‌బాడీని వైద్య కళాశాలకు అందించి వారికుటుంబానికి ప్రగాఢ శ్రద్ధాంజలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ పరిణామక్రమంలో అత్యంత ఆధునిక జీవన విధానంలో మానవ శరీర ఆరోగ్య సమస్యలు పెరిగాయి అనడానికి జీవనవికాసంలో అనేక ఆధునిక ఆవిష్కరణలు జరిగాయన్నారు. అందులో భాగంగా మానవ డెడ్‌బాడీని అధ్యయనం చేయడం "మెదడు మరణం" కాని శరీరం నుంచి అవయవాలు బతికిన శరీరాలకు అమర్చడం అనే అద్భుత ప్రక్రియను కనిపెట్టారన్నారు. దాన్ని మనం ముందుకు తీసుకెళ్లి మరణాల సంఖ్యను తగ్గించుకుందామన్నారు. దాతలు నిరుపేదలు అయితే ఏదన్నా ప్రభుత్వ పథకం అమలు చేయాలని, సహాయం అందించాలని కోరారు. ఇలాంటివి కొన్ని రాష్ట్రాల్లో అమలు జరుగుతున్నాయని తెలిపారు. మన రాష్ట్రంలోను వీటిని అమలు చేయాలని కోరారు.

టీజీవో అసోసియేట్ అధ్యక్షునికి సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన

వేల్పూర్ మండలంలోని లక్కోర గ్రామానికి చెందిన ఉట్నూర్ సుభాష్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మండల పిఆర్టియు ప్రధాన కార్యదర్శి సి.వెంకట నరసింహారావు, వేల్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు చాదల్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బైరి సంపత్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీల నాయకులు, లక్కోర గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని జిరాయిత్ నగర్ ఆటో స్టాండ్ వద్ద సోమవారం ఉదయం అయ్యప్ప స్వామి పడిపూజ, మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నట్టు రేణుక జ్యువెలర్స్ యజమాని సంతాని గణేష్ ఆదివారం తెలిపారు. నాగేష్ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ కార్యక్రమానికి అయ్యప్ప మాలధారలు, భక్తులు పాల్గొనాలని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని నాగేంద్ర నగర్ గ్రామానికి చెందిన బొల్లి దేవాయికి 34 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైంది. ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితురాలికి చెక్కును అందజేశారు. చెక్కు మంజూరుకు కృషిచేసిన తెలంగాణ రాష్ట్ర సహకార సంఘ అభివృద్ధి చైర్మన్ మానాల మోహన్ రెడ్డికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జోరు తగ్గని మట్కా జూదం

- రోడ్డున పడుతున్న కుటుంబాలు

నవతెలంగాణ-ఆర్మూర్



డివిజన్లో మట్కా దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. కూలీ నాలి చేసుకొని కూడబెట్టిన డబ్బు మట్కా జూదానికి తగిలేస్తుండడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుం టున్నారు. మట్కా, జూదం కుటుంబాల ఉసురు పోసుకుం టుంది. తాజాగా కమ్మర్‌పల్లి మండలంలో ఆర్మూర్ పట్టణానికి చెందిన దోండి డల్లి గంగా మోహన్ (43), 16 సంవత్సరాలక్రితం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పువ్వుల దుకాణం పెట్టుకుని భార్య, ఇద్దరు పిల్లలను పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా మట్కా జూదానికి అలవాటు పడి 30 లక్షల వరకు అప్పులు కావడంతో చేసిన అప్పులు తీర్చలేక గురువారం కమ్మర్పల్లి వరద కాలువలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కుటుంబం రోడ్డున పడటంతో భార్య పిల్లల పరిస్థితి ఏంటని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్కా జూదానికి మరొక కుటుంబం వీధిన పడక ముందే పోలీసులు మట్కా మహమ్మారిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలో మట్కా జోరు..?

పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో మట్కా జూదం ఆన్లైన్లో భారీగా జరుగుతుంది. గోల్ బంగ్లా. మీది బజార్ పిప్రి గైనిలలో నలుగురు నుంచి ఐదుగురు మట్కా బుకీలు దందా నడిపిస్తున్నట్లు తెలిసింది. గోల్ బంగ్లా ప్రాంతంలో నగేష్, గంగాధర్ కమిషన్ కోసం బుకీలుగా పనిచేస్తున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు. పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరు పరిచిన జరిమానాలు కట్టుకొని దర్జాగా బయట తిరుగుతున్నారు. మట్కా బుకీలను అరెస్టు చేస్తే కనీసం మూడు నెలల పాటు జైలులో ఉండేలా పోలీసులు కేసులు నమోదు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సాధనాశూరుల విన్యాసాలు



విన్యాసాలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నడిమిగల్లిలో సాధనాశూరుల విన్యాసాలు ఆదివారం నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలోని వీణవంక మండలం చల్లూర గ్రామానికి చెందిన చింతకింది తిరుపతి ఆధ్వర్యంలో 8మంది కళాకారులు పలు విన్యాసాల ద్వారా గ్రామస్తులను అలరించారు. వ్యక్తులను తాళ్లతో బంధించి సునాయాసంగా విడిపించుకోవడం, చీపురు పుల్లలపై కళాకారుడు కూర్చోవడం, వంటి ఎన్నో కళాత్మక కనికట్టు విద్యలతో గ్రామస్తులను అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా బాల్కొండ పద్మశాలి సంఘం అధ్యక్షులు బూస శ్రీనివాస్ నగదుతో కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఓమాజీ కిషన్ ప్రసాద్, సెక్రటరీ కట్కం రవి, ఆలయ కమిటీ అధ్యక్షులు శివలింగం నాలుగు పంతల మేతరులు నవీన్, నాగరాజు, వెంకటగిరి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మద్దతు తెలుపుతున్న అనిల్‌కుమార్

జిల్లా కేంద్రంలో 23 రోజులు గా జరుగుతున్న సమగ్ర శిక్ష ఉద్యో గుల నిరవధిక సమ్మెలో టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్ పాల్గొని సంఘీభావం మద్ద తు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 సంవ త్సరాలుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు కేజీబీవీ ఉపాధ్యాయులు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, అనేక బాధలు పడ్డారన్నారు. ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా ఈనెల 26న హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద భారీ స్థాయిలో ధర్నా నిర్వహించామని తెలిపారు. దానిలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పాల్గొని న్యాయబద్ధమైన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె గురించి ప్రభుత్వంతో చర్చించి వారి సమస్య పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. ప్రభుత్వం మొండివైఖరి మాని వెంటనే చర్చలు జరిపి సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. అంతవరకు పూర్తి మద్దతిస్తునానమని తెలిపారు. టిపిటిఎఫ్ సీనియర్ నాయకులు తోట హనుమాన్లు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయ సమ్మతమైన పోరాటానికి ఫెడరేషన్ కార్యకర్తలు అందరూ మద్దతుగా ఉండాలన్నారు. సమ్మెలో టిపిటిఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు వెనిగర్ల సురేష్, ప్రధాన కార్యదర్శి పూదారి అరవింద్, జిల్లా బాధ్యులు రాజు, విజయ్ గంగామణి, కేజీబీవీఎస్ఓలు ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

- రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్
- మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్ అన్నారు. ఆదివారం తోట రాజశేఖర్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్మదినాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అందులో తోట రాజశేఖర్ 82 ఒకసారి రక్తదానం చేశారు. ఇందులో పలువురు ఉద్యోగులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నిజామాబాద్ బస్వారెడ్డి హాజరై యువతకు సమాజానికి పిలుపునిచ్చారు. యువత, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ దానగుణాన్ని అలవర్చుకొని తమకు తోచింది అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ బి ఆంజనేయులు, కోశాధికారి కరిపే రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటకృష్ణ, డాక్టర్ అబ్బపు రవీందర్, సెక్రటరీ అరుణ్ బాబు, వెంకటేశం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, జిపిటి అలుమిని సభ్యులు కేఎల్వి రమణ, గణేష్, సత్యనారాయణ, ఎస్టియు సభ్యులు ధర్మేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, రక్త దాతలు సంయోద్దీన్, శిరీష్, సాయి ప్రగతి, గణేష్, శ్రీ ప్రవల్లిక, శిరీష్, రెడ్‌క్రాస్ సిబ్బంది 20 మంది రక్తదానం చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటా

- నుడా చైర్మన్ కేశవేణు

నవతెలంగాణ-కంఠేశ్వర్



డివిజన్‌ను సందర్శిస్తున్న నుడా చైర్మన్ కేశవేణు

గత ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడిపోయిందని నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ ఆథార్టి చైర్మెన్ కేశ వేణు అన్నారు. 7 వ డివిజన్‌కు చెందిన రామర్తి గోపి, 8వ డివిజన్ కు చెందిన రమేష్‌ల అధ్వర్యంలో స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు నుడా చైర్మెన్ కేశ వేణు అదివారం రోటరీనగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రోటరీ నగర్ ప్రజలు పలు సమస్యలను కేశవేణు దృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా కేశ వేణు మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 7,8వ డివిజన్‌లతో పాటు అన్ని డివిజన్లలో లోని అన్ని సమస్యలను పరిష్కరించి డివిజన్లను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇందుకోసం సమస్యలను పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుండి అధిక మొత్తంలో నిధులు తీసుకువచ్చి డివిజన్లలో మౌలిక వసతులైన తాగునీరు, డ్రైనేజీల నిర్మాణం, బీటీ రోడ్లు, సిసి రోడ్లు, విద్యుత్ దీపాలతోపాటు డివిజన్లో అవసరమైన చోట పార్కులను కూడా నిర్మిస్తామని ఆయన అన్నారు. నుడా చైర్మన్‌గా తాను కూడా ప్రత్యేక నిధులతో డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిస్తానని ఆయన పేర్కొన్నారు. ఇక నుండి నగరంలోని ప్రతి డివిజన్ ను సందర్శించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతానని ఆయన ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామర్తి గోపి కాలనీ సభ్యులు బంటు రామ్ కుమార్, వెంకటేశ్వర్ చారి,నరసింహ స్వామి, స్వామి గౌడ్, సతీష్,హనుమాన్లు, దత్తు, సుభాష్ చారి, సుదర్శన్, రూప్సింగ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోధన్‌లో 'బుల్లెట్ రెడ్డి' సినిమా చిత్రీకరణ



నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం మినార్‌పల్లి వాసి ఆదినారాయణ నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలు వహిస్తూ హీరోగా నటిస్తున్న బుల్లెట్ రెడ్డి సినిమా షూటింగ్ చిత్రీకరణను బోధన్ పట్టణ సమీపంలోని కమ్మ సంఘంలో ఆదివారం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఫైటర్స్ హీరోతో తలపడే సీన్‌ను ఆదివారం, సోమవారం కమ్మసంఘంలోనే చిత్రీకరణ చేస్తామని సినీ హీరో దర్శక, నిర్మాత ఆదినారాయణ తెలిపారు. ఈ ఫైటింగ్ చిత్రీకరణకు బోధన్ పట్టణానికి చెందిన ప్రముఖ కరాటే మాస్టర్ ఖయ్యూం సారథ్యంలో చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో మేఘ హీరోయిన్‌గా నటిస్తున్నారు. చిత్రం షూటింగ్‌ను తిలకించేందుకు ప్రజలు తరలివస్తున్నారు.

ఆర్థికసాయం చేసి ఆదుకోండి

- ఏడాది బాలుడికి మెడపై గడ్డ.. వైద్యం కోసం ఆర్థికసాయం చేయాలని వేడుకోలు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలోని 16వ వార్డుకు చెందిన మల్లెపూల అభిరామ్ మెడపై గడ్డ కావడం వల్ల నిజామాబాద్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.60,000 అవుతుందని బాలుడి తల్లి సరోజ, తండ్రి మల్లెపూల రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం చేసే వాళ్లు ఉంటే 9346131816 ఈ నెంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే చేయాలని, పిల్లాడి ఆరోగ్యం విషయంలో తమకు అండగా ఉండాలని కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న బాలుడు

కల్లుకు గొబ్బలు కరువు..
ప్లాస్టిక్ బిందెలే దిక్కు..


- కనుమరుగవుతున్న కల్లు లొట్లు
- పెరిగిన ప్లాస్టిక్ బిందెల వాడకం

నవతెలంగాణ-లింగంపేట్

తమ గీత వృత్తినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న గీత కార్మికులకు మట్టితో తయారు చేసిన గొబ్బలు కరువు కావడంతో ఈత చెట్లకు కల్లుకోసం ప్లాస్టిక్ బిందెలనే కడుతున్నారు. ఈ వృత్తిని జిల్లా వ్యాప్తంగా వందలాది మంది గీత కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. చెట్టు నుంచి కల్లు గీసేందుకు గొబ్బలు కరువవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో ఈతవనాలు అధికంగా ఉఉన్నాయి. జిల్లాలోని దోమకొండ, మాచారెడ్డి, రామారెడ్డి, లింగంపేట్, నిజాంసాగర్, నాగిరెడ్డిపేట్, బాన్సువాడ, రాజంపేట్, మహమ్మద్‌నగర్, నసురుల్లాబాద్ తదితర మండలాల్లో ఈతవనాలు ఎక్కువగా ఉన్నాయి. గీత కార్మికులు కల్లుగీత వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే స్వచ్ఛమైన ఈత కల్లు ఆరోగ్యానికి మంచిదని పలువురు ఆరోగ్య నిపుణులు సూచిస్తుండటంతో ఈత కల్లుకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో యువకులు, పెద్దలు ఈత కల్లు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే పూర్వకాలంలో ఈత కల్లు కోసం ఈత చెట్టుకు కుండలు (గొబ్బలు) కట్టేవారు. ఈత వనాలకు కట్టే గొబ్బలను ఆకతాయిలు పగులగొడుతుండటంతో కల్లును, గొబ్బలను నష్టపోతున్నామని గీత కార్మికులు చెబుతున్నారు. అలాగే రానురానూ గొబ్బలు మాయమవుతున్నాయి. మట్టి గొబ్బల ద్వారా వచ్చిన కల్లును సేవిస్తేనే బాగుంటుందనే అభిప్రాయం కల్లుప్రియుల్లో వ్యక్తమవుతోంది.

అలాగే మట్టితో తయారు చేసిన గొబ్బలు గతంలో విరివిగా విక్రయించేవారు. ప్రస్తుతం మట్టి దొరకకపోవడంపాటు, తయారు చేసినా గిట్టుబాటు ధర రాకపోవడంతో వాటిని కుమ్మరులు తయారు చేయకపోవడంతో గీత కార్మికులకు చేసేదేమీలేక ప్లాస్టిక్



బిందెలను ఈత చెట్లకు కడుతున్నారు. ఒకవైపు ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్‌ను ఎక్కువగా ఉపయోగించవద్దని ప్రభుత్వం సూచిస్తోంది. స్వచ్ఛంధ సంస్థలు సైతం ప్రచారం నిర్వహిస్తున్నాయి. కానీ మట్టి గొబ్బలు కరువవడంతో తప్పని పరిస్థితుల్లో గీత కార్మికులు మట్టి గొబ్బల స్థానంలో ప్లాస్టిక్ బిందెలను కడుతున్నారు.

కామారెడ్డి పట్టణ జనరల్ స్టోర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల జనరల్ స్టోర్స్ అసోసియేషన్, బుక్ సెల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగనుందని సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులుగా కొమ్మ శ్రీనివాస్, (గణేష్ జనరల్ స్టోర్స్ బుక్ సెల్లర్స్), ప్రధాన కార్యదర్శిగా గంప సుధాకర్ (తిరుమల జనరల్ స్టోర్స్ బుక్ సెల్లర్స్), కోశాధికారిగా గంప ప్రసాద్ (కృష్ణ ప్రసాద్ బుక్ సెల్లర్స్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో నివాసకు ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామానికి చెందిన న్యాకపు నరసయ్య నివాసపు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట‌తో శనివారం సాయంత్రం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో న్యాకపు నర్సయ్య ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి వ్యాపించాయి. దీంతో ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో పలు వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు, రూ.5000 నగదు కాలి బూడిదయ్యాయి. సకాలంలో నిజామాబాద్ అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వీరితో పాటు ఎడపల్లి పోలీసులు సైతం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

మూలమలుపులు.. మృత్యుదారులు



ప్రమాదకరమైన మూల మలుపు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ సమీపంలో కామారెడ్డి ఎల్లారెడ్డి వెళ్లే రహదారి ప్రమాదకరమైన మూల మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురై ఇటీవల పలువురు మృతి చెందారని, అయినప్పటికీ సంబంధిత అధికారులు సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యతగా ఉండాలి

- సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

ఆర్యవైశ్యులు ఐక్యతగా ఉండాలని ప్రముఖ సైంటిస్ట్, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం అబ్దుల్ నగర్ శివారులోని ఓ అతిథి గృహంలో జరుగుతున్న నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. వైశ్యులు ఐక్యతగా ఉండి అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని అన్నారు. నియోజకవర్గ వైశ్యులలో పేదలకు వైద్య, విద్య, సౌకర్యానికి తన వంతు కృషి చేస్తానని, దిగులు చెందవద్దని తెలిపారు. తాను అండగా ఉండి ఇండ్లు లేని పేదలు నిర్మించుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. వైశ్య భవనం నిర్మాణం చేపట్టుకుంటే 2000 గజాల స్థలాన్ని ఇస్తానని అన్నారు. చిన్నపాటి సమస్య వచ్చిన తన సంప్రదిస్తే సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు, మహిళలు, గంగ చరణ్ గుప్తా, పడకంటి శ్రీనివాసులు, కిషోర్ గుప్తా, కాసెట్టి చంద్రశేఖర్ గుప్తా, జూలూరు వేణు గుప్తా, పడకండ రాజు గుప్తా, పార్సి చంద్రమౌళి గుప్తా, నియోజకవర్గ ఆర్యవైశ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మితో ఆర్టీసీకి పెరిగిన ప్రయాణికులు

- మరిన్ని బస్సుల కోసం నివేదించాం
- బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం కల్పిస్తాం : కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా

నవతెలంగాణ-కామారెడ్డి

మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులరద్దీ పెరిగిందని కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా తెలిపారు. పండుగ వేళల్లో రద్దీతో ఒకొక్క రోజుకు రూ.14 లక్షల వరకు ఆదాయం వస్తున్నట్టు తెలిపారు. కాగా ప్రయాణికు లకు అనుగుణంగా బస్సులు సరిపోవడం లేదని, అదనపు బస్సుల కోసం ఉన్నతాధికారు లకు నివేదించినట్టు తెలిపారు. నవతెలంగాణ విలేకరికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

కామారెడ్డి డిపోలో 124 బస్సులు ఉన్నాయని ఇందులో 79 ఆర్టీసీ కార్పొరేషన్‌కు చెందినవని, 45 ప్రైవేట్ హైర్ బస్సులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ బస్సులు అన్నీ కూడా వివిధ రోడ్లలో నడుస్తు న్నాయని, హైదరాబాద్‌కు ప్రతిరోజు డీలక్స్ 28 బస్సులు, సూపర్ లగ్జరీ ఎనిమిది బస్సులు, డీలక్స్ బస్సులు 20 నడుస్తున్న యన్నారు. కామారెడ్డి నుండి వేముల వాడ, కాళేశ్వరం, భద్రాచలం తదితర పుణ్య క్షేత్రాలకు ప్రతిరోజు కామారెడ్డి డిపో నుండి బస్సులు కొనసాగు తున్నాయ న్నారు. కామారెడ్డి డిపోలో శిక్షణ ఉన్న డ్రైవర్లు ఉన్నారని సంస్థ అభివృద్ధి కోసం వారు సాయశక్తుల కృషి చేస్తున్నారన్నారు. వివిధ పండుగ సందర్భాలలో కామారెడ్డి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రతిరోజు మహాలక్ష్మి పథకం ద్వారా ఒక్క రోజుకు 14 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు.



డిపో మేనేజర్ ఇందిరా

ప్రస్తుతం బస్సులు సరిపోవడం లేదని ఆర్టీసీ ఉన్నత అధికారులను తమకు ఇంకా పదిహేను పల్లె వెలుగు బస్సులు అవసరం ఉన్నాయని కోరామని, త్వరలోనే అవి కామారెడ్డికి రానున్నట్టు తెలిపారు. కండక్టర్‌లు, డ్రైవర్లు సమన్వయంతో పని చేస్తున్నారని, మహాలక్ష్మి వచ్చిన తర్వాత మా సిబ్బందిలో ఉత్సాహం పెరిగిందన్నారు. వారు ఎంత రద్దీ ఉన్నా ఉత్సాహంగానే విధుల్లో కొనసాగుతున్నారని తెలిపారు.

డిపోలో 200 మంది కండక్టర్లు 170 మంది డ్రైవలు ప్రస్తుతం విధుల్లో కొనసాగుతు న్నారని వెల్లడించారు. తాగునీటి వసతి గురించి పప్రశ్నించగా తమ బస్టాండ్, డిపో పరిధిలో రెండు బోర్లను మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరామని, త్వరలోనే ఆ బోర్లను వేసి తాగు నీటి కొరతను తీరుస్తామన్నారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి వ్యక్తిగత మరుగుదొడ్లకు వినియోగిస్తున్నట్టు తెలిపారు.

డివైడర్ కూలిపోయినా పట్టింపు లేదు

నవతెలంగాణ-బోధన్



కూలిన డివైడర్

గత ప్రభుత్వ హయాంలో పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా నిర్మించిన డివైడర్ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కూలిపోయింది. దాంతో రాళ్లు చెల్లాచెదురయ్యాయి. ఈ డివైడర్ కూలిపోయి నెలలు గడుస్తున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టిం చుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. అభివృద్ధి పనుల కోసం లక్షల రూ పాయలు వెచ్చిస్తున్న అధికారులు కనీసం కూలిపోయిన డివైడర్ మరమ్మ తులకు కనీస చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబం ధిత మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి కూలిపో యిన డివైడర్‌ను పునర్నిర్మాణం చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన పేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కురుమ సాయిబాబా ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశానుసారం గ్రామానికి చెందిన పూట గడవని నిరుపేద కుటుంబానికి ఆదివారం బియ్యం బస్తాలు ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కురుమ సాయిబాబా, మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, ఆశమొల్ల, కటికేల శ్రీనివాస్, బాలాజీ గ్రామస్తులు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ల నియామకం

- నిరసన వ్యక్తం చేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ 20 రోజులుగా సమ్మె చేస్తున్నా పరిష్కారం చూపించకుండా అధికారులు కస్తూర్బా పాఠశాలలో ప్రత్యేక అధికారులను నియమించడంతో వారికి పుష్పగుచ్ఛం అందజేసి నిరసన తెలిపినట్టు ఆయన అన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గతంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన వ్యక్తపరచిన సమయంలో హనుమకొండలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నాకు అప్పటి పిసిసి అధ్యక్షుని హెూదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి మీ సమస్యను తాము అధికారంలోకి రాగానే 10 నిమిషాలలో పరిష్కరిస్తామని హామీనిచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి అధికారంలో ఉండడం వల్ల తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. రెగ్యులరైజేషన్ రాష్ట్రంలో కొత్తేం కాదని ఐకెపి, వీఆర్ఏలను, కాంట్రాక్టు లెక్చరర్‌లను రెగ్యులర్ చేశారని ఆయన గుర్తు చేశారు. తమకు రెగ్యులరైజేషన్ చేయడంలో ప్రభుత్వానికి ఎలాంటి



నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఇబ్బందులు లేవని ఆయన అన్నారు. సమగ్ర శిక్షలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులను నియమించుకోవడం కొరకు అప్పటి ప్రభుత్వం, అధికారులు పత్రికా ప్రకటనలు ఇచ్చి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ముగ్గురు మెంబర్లతో కమిటీ వేసి ఈ నియామకాలు రోస్టర్ కం మెరిట్ ప్రకారం ఎంపిక చేశారని తెలిపారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి పేస్కేల్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ మండల విద్యాధికారి వై.తిరుపతిరెడ్డి, మహమ్మద్‌నగర్ మండల విద్యాధికారి ఎల్.అమర్‌సింగ్, కేజీబీవీ ఇంచార్జి, స్పెషల్ ఆఫీసర్ సమత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జె.రాజు, సిఆర్పిలు కె.వెంకటరామగౌడ్, వి.శంకర్‌గౌడ్, పి.నర్సింలు, బి.శ్రీధర్ కుమార్, పిటిఐలు జి.హరీష్, కె.భూమయ్య, కేజీబీవీ ఉపాధ్యాయులు రజిత, సరిత, రమాదేవి, పర్జన సిబ్బంది అనిత, కవిత, లావణ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన

- ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-కామారెడ్డి



రాష్ట్రవ్యాప్తంగా భోజనం విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవాన్ సుభాన్ సింగ్ సోమవారం తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, తుక్కుగూడ హై పాఠశాలలో దళిత హెడ్ మాస్టర్ రాములుపై సభ్య సమాజం సిగ్గుపడేలా దాడిచేసి హెడ్ మాస్టర్ చేత విద్యార్థి కాళ్లు మొక్కిచ్చిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పాఠశాలల్లో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపాలన్నారు.

కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణం పనులు



కొనసాగుతున్న కల్వర్టు పనులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని కట్టుకాలువపై కల్వర్టు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పెద్దవాగు నుంచి మత్తడి కాలువ మట్టితో పూర్తిగా కూరుకుపోయింది. కట్టుకాలువా నిర్మాణం పనులు చేపట్టాలని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సానుకూలంగా స్పందించి కట్టు కాలువ నిర్మాణం పనులకు రూ.49 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో కట్టు కాలువ పూడికతీత పనులు వేగవంతంగా సాగుతున్నాయి. లింగంపేట్ గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతనంగా కల్వర్టు నిర్మాణం చేపడుతున్నారు. పెద్దవాగు నుండి మొదలుకొని ఐలాపూర్ ఊరచెరువు చీర పెండ్లకుంట, సువర్ణకుంటకు కట్టు కాలువ ద్వారా సాగునీరు సరఫరా చేయడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కట్టుకాలువపై కల్వర్టు నిర్మాణం పనులు చేపట్టడంతో గ్రామంలోకి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా దారి మళ్ళించారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ డిఈ మధుసూదన్‌రెడ్డి అన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష భగ్నం

- ధర్మ సమాజ్ పార్టీ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-కామారెడ్డి

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మూడవ రోజు విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనకై చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. దీక్షలో కూర్చున్న లక్ష్మణ్, రాజును పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారని జిల్లా కన్వీనర్ బోలెశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ ఇవ్వకుండా, మూడు రోజులు ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్ష చేస్తే ప్రభుత్వం నుంచి ఒక అధికారి, ఒక రాజకీయ నాయకుడు కూడా పట్టించుకోకుండా తమ డిమాండ్లను అసలు పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించిందన్నారు. రానున్న రోజుల్లో తమ పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ఉద్యమానికి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ లక్ష్యాన్ని ఆపలేరన్నారు. ఈ పోరాటం ఇలాగే కొనసాగుతుందని ధర్మ సమాజ పార్టీ ప్రకటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజు, సత్యం, రాజు, కవిన్, రాజశేఖర్, రాజు, శివరామకృష్ణ వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.



ధర్మ సమాజ్ పార్టీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షులుగా పంబల్ల సతీష్

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షునిగా పంబల్ల సతీష్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉపాధ్యక్షులు ముదాం దత్తాత్రేయ తెలిపారు. కోశాధికారిగా టి.శ్రీకాంత్‌రావు, కార్యదర్శిగా గొల్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా చందు, సలహాదారులుగా మెట్టు రాము, వసంతరావు, నవీన్, తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు. యూత్ క్లబ్‌కు స్వచ్ఛంద సేవలతో పాటు క్రీడాకారులకు తన వంతు కృషి చేస్తానని అధ్యక్షులు తెలిపారు. ఈ ఎన్నికల్లో గ్రామపెద్దలు, మాజీ సర్పంచ్ బండారు సంజీవ్, మాజీ మండల ఉపాధ్యక్షులు ముదాం నర్సింలు, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మెట్టు రామచంద్రం, ఎర్రవటి రాజు తదితరులు పాల్గొన్నారు.

23వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలోగల దీక్షా శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు 23వ రోజు నిరసనలో భాగంగా బతుకమ్మలు ఆడి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భూపేందర్ మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకంగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో భవిత కేంద్రాల్లో కేజీబీవీ పాఠశాలల్లో ఎక్కడి పనులు అక్కడ స్పందించిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షులు వెనిగల్ల సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్, బహుజన టీచర్స్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి నాయక్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, మాల మహానాడు నాయకులు రాజేందర్, చంద్రశేఖర్, కే రవి, ప్రభంజన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనపరచిన నటరాజ నృత్యానికేతన్ చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా గల నటరాజ నృత్యానికేతన్ చిన్నారులు పోతుగంటి సహస్ర, బొచ్కర్ అక్షర, సిసిఆర్టి స్కాలర్షి పరీక్షకు ఎంపికైనట్టు నాట్య గురువు డాక్టర్ బాశెట్టి మృణాళిని ఆదివారం తెలిపారు. హైదరాబాద్ సిసిఆర్టి పరీక్ష కేంద్రంలో వారు ఉత్తీర్ణత కనబరిచి జడ్జిలను మెప్పించి స్కాలర్షిప్‌కి ఎంపికైనట్టుగా సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఇంకా ఎంతో మంది చిన్నారులు నృత్యంలో రాణించాలని దానికి తల్లిదండ్రులు సహకారం తప్పకుండా ఉండాలని ఈ సందర్భంగా కోరారు.

విప్లవ రాజకీయాలవైపు నిలబడ్డ నేత గొర్రెపాటి మాధవరావు

- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నేతలు
- హక్కుల నేత కామ్రేడ్ మాధవరావ్ కు నివాళులు



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామబాద్ సిటీ

జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టీ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు కామ్రేడ్ గొర్రెపాటి మాధవ రావు భౌతిక కాయానికి పలువురు నేతలు ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యార్థిదశ నుండే విప్లవ రాజకీయాలను అలవర్చుకొని జిల్లా విప్లవ రాజకీయాలవైపు నిలబడ్డ నేత అన్నారు. పిడిఎస్‌యు నిర్మాత కామ్రేడ్. జంపాల ప్రసాద్‌తో కలిసి క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు. పోలీస్‌ల అక్రమ అరెస్టులు, ఎన్ కౌంటర్స్‌కు వ్యతిరేకంగా వాదించిన న్యాయవాది అన్నారు. బతికినన్ని రోజులు ప్రజల పక్షాన నిలబడ్డారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి. ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వి. కృష్ణ, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి. దేవారం, సహాయ కార్యదర్శి ఆర్. రమేష్, జిల్లా నాయకులు ఎస్. సురేష్, ఆకుల. గంగారాం, బి. బాబన్న తదితరులు నివాళులు అర్పించారు. ఆరోగ్యం బాలేక రాలేని స్థితిలో ఉన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పి.రంగారావు పంపిన నివాళి సందేశాన్ని చదివి నివాళులు అర్పించారు.

సేవారంగంలో పట్వారి తులసికి జాతీయస్థాయి పురస్కారం



తులసి పట్వారిని సన్మానిస్తున్న ప్రముఖులు

నవతెలంగాణ-ఆర్మూర్

సేవారంగంలో పట్వారి తులసి జాతీయస్థాయి పురస్కారం అందుకున్నారు. పుడమిరత్న జాతీయ స్థాయి విశిష్ట సేవా పురస్కారాలు – 2024 కార్యక్రమం ఖమ్మం జిల్లాలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వివిధ జిల్లాల నుండి మొత్తం 60 మంది పురస్కార గ్రహీతలను ఎంపిక చేశారు. అందులో తెలంగాణ రాష్ట్రం నుండి జిల్లాలోని ఆర్మూర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్ 15 సంవత్సరాలుగా చేస్తున్న వ్యక్తిగత సేవలను గుర్తించి జాతీయస్థాయి పురస్కారానికి ఎంపిక చేశారని తెలిపారు. ఈ పురస్కారం విశిష్ట అతిథులు పద్మశ్రీ వనజీవి రామయ్య, భక్త రామదాసు పదవతరం వారసులు కంచర్ల శ్రీనివాస్, మానవ హక్కుల ప్రజ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు హైమావతి , పుడమి రత్న జాతీయ అధ్యక్షులు బాల్ రెడ్డి, విశిష్ట ప్రముఖుల చేతుల మీదుగా సన్మానం, ప్రశంసా పత్రం, అవార్డు అందుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పట్వారీ తులసి మాట్లాడుతూ తాను చేస్తున్న ఈ సేవలకు జాతీయస్థాయిలో అవార్డు రావడం చాలా ఆనందంగా గర్వ కారణంగా ఉందని, తనకు ఎల్లప్పుడూ సహకారంగా ఉన్న తన మాతృమూర్తి బాల సరస్వతి, అన్నయ్య, వదిన పట్వారి గోపికృష్ణ, ప్రగతి, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు.

గుండెపోటుతో వ్యవసాయ కూలీ మృతి

- పొలం పనులు చేస్తుండగా ఘటన

నవతెలంగాణ-ఆర్మూర్

వ్యవసాయ క్షేత్రంలో పొలం పనులు చేస్తుండగా దత్తారావు(43) అనే వ్యవసాయ కూలీ గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మిర్దాపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది.. స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. మండలంలోని మిర్దాపల్లికి చెందిన నారాయణ వద్ద బోధన్ మండలం కల్దుర్కికి చెందిన దత్తారావు కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. దత్తారావు పొలంగట్టుపై పనిచేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. మృతుడి భార్య భూమాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ ఓ తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే చోట చేరిన పూర్వవిద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

1998-99 పదోతరగతి బ్యాచ్ రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో 'సిల్వర్ జూబ్లీ ప్రోగ్రామ్' నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

50 గ్రాముల గంజాయి పట్టివేత

- పట్టు పడ్డది ఇద్దరా.. ముగ్గురా..?
- వదిలిపెట్టించేందుకు నాయకుల విశ్వప్రయత్నాలు

నవతెలంగాణ-ధర్పల్లి

సంవత్సరకాలం నుండి మండలంలో గంజాయి సరఫరా అవుతుందని, ఇందుకు మండలంలోని ఆయా ప్రాంతాల్లో కొందరు ద్విచక్ర వాహనాలపై వస్తూ వారికి తెలిసిన వారికి ముట్టచెప్పి గుట్టు చప్పుడు కాకుండా వెళ్తున్నారని ప్రచారం జోరుగా సాగుతుంది. దీనిపై స్థానిక పోలీసులు గట్టి నిఘా వేసి పట్టుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసిన విఫలమైనట్లు తెలుస్తుంది. ఏదేమైనప్పటికీ ఎస్ఐ రామకృష్ణ గంజాయిని ఎలాగైనా అరికట్టాలనే సంకల్పంతో నిఘా వేసి ఉంచారని, ఇందులో భాగంగానే ఎట్టకేలకు శని వారం మండలంలోని మైలారం, కేసారం గ్రామాల్లో తన సిబ్బందితో వెళ్లి వేచారణ మొదలు పెట్టినట్లు సమాచారం.

ఎంతగా వెతికిన గంజాయి అమ్మకానికి వచ్చిన వ్యక్తి జాడ తెలియకపోవడంతో, వారిని ఎలాగైనా పట్టుకోవాలనే పట్టుదలతో వెతికే ప్రయత్నంలో కొందరు కేసారం గ్రామ సమీపంలో అనుమానితులను గుర్తించి విచారించగా వారివద్ద 50గ్రాముల గంజాయి లభించినట్లు విశ్వాసనీయ సమాచారం. పట్టుబడిన వారిలో ఇద్దరు ఉన్నారా.. ముగ్గురు ఉన్నారా..? అనే సమాచారం తెలియడంలేదు. అందులో ఒకరిది కేసారం, మరొకరిది మైలారం అని, మరొకరిది ఆర్మూర్ ప్రాంతంలోని మామిడి పల్లి అని తెలుస్తుంది. కాగా సదరు గంజాయితో దొరికిన వారిని వదిలిపెట్టాలని కొందరు నాయకులు పోలీసులకు ఒత్తిడి తెస్తున్నారని తెలిసింది. అయినప్పటికీ గంజాయి అరికట్టేందుకు చేసిన ప్రయత్నంలో దొరికిన వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని భీష్మించుకొని కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఏదేమైనా గంజాయి సరఫరా చేసే వ్యక్తిని పోలీసులు పట్టుకొని శభాష్ అనిపించుకున్నారు. కానీ నాయకుల ఒత్తిడికి ఏమవుతదోనని చర్చించుకుంటున్నారు. దీంతోపాటు ఇటీవల ఆర్మూర్ ప్రాంతం నుండి మండలంలో హుండీ దందా జోరుగానే సాగుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గంజాయి సరఫరా అనేది కొరియర్ బాయ్‌ద్వారా గుట్టు చప్పుడు కాకుండా సరఫరా అవుతుందని, మండలకేంద్రంలో హెూటళ్ళలో టీతాగే సాకుతో అక్కడే చేతులు మారుతున్నట్లు సమాచారం. మండలకేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో కొరియర్ బాయ్ లు స్కూటీ పైన వచ్చి ఇచ్చి వెళుతున్నారని తెలిసింది. ఈమధ్య కాలంలో మండలకేంద్రంలో యువత బాగానే అలవాటు పడినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. యువత ఇలాంటి వ్యసనాలకు అలవాటు పడవద్దని అటు ప్రభుత్వం, మరోపక్క పోలీసు యంత్రాంగం ఎన్ని అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి తెలుపుతున్నప్పటికి మార్పు కానరావడం లేదని, పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి ఇలాంటి వారిపై గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి దేవారం

నవతెలంగాణ-ఆర్మూర్

ఇటుక బట్టి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో చనిపోయిన లక్ష్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవారం అన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ సంయుక్త మండలాల కమిటీ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతంలో ఇటుక బట్టి కార్మికుల సమస్యలపై ఆదివారం ఇస్సపల్లి గ్రామ శివారులో పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవారాం, సంయుక్త మండల కార్యదర్శి బి కిషన్ మాట్లాడుతూ ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో ఇటుక బట్టి కార్మికులు ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నేటికీ కార్మికులకు ప్రభుత్వం లేబర్ కార్డులను జారీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని తప్పుపట్టారు.. ఆర్మూర్ మండల పరిధిలోని ఇస్సాపల్లి గ్రామ శివారులో ఇటుక బట్టులో పనిచేస్తున్న లక్ష్మయ్య అనే యువ కార్మికుడు ఇటుక బట్టీలు ట్రాక్టర్ బోల్తా పడి చనిపోయాడని అన్నారు. చనిపోయి మూడు రోజులు అయినప్పటికి అధికారులు పరిశీలన చేయడం గాని కార్మికుల సమస్యల్ని తెలుసుకోవడం గాని ఏమాత్రం చేయకుండా కాల యాపన చేస్తున్నారని ఖండించారు. ఒకవైపు వారికి ఆధార్ కార్డు కూడా లేదని అన్నారు లేబర్ అధికారులు కార్మికుల సమస్యల్ని పరిష్కరించాల్సింది పోయి నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం సరైనది కాదని వారు అన్నారు. అనేకమంది వలస వచ్చి తమ జీవనాన్ని గడుపుతున్నారని తెలిపారు. కానీ వారి సమస్యలు తెలుసుకోవడానికి అధికారులకు సమయం దొరకలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం లేబర్ అధికారులు ఇటువంటి కార్మికుల సమస్యల్ని తెలుసుకొని పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. తక్షణమే వారికి ఆధార్ కార్డులు, లేబర్ కార్డులను జారీ చేయాలని వారు అన్నారు. లేబర్ కార్డు జారీ చేయడం వల్ల వారికి పని చేసే సమయంలో ఏమైనా ప్రమాదం సంభవిస్తే వారి కుటుంబానికి ఇన్సూరెన్స్ ఆసరాగా అవుతుందని అన్నారు. లేబర్ కార్డు లేనందువల్ల లక్ష్మయ్య కుటుంబానికి ఇన్సూరెన్స్ కూడా వర్తించదని తెలిపారు. ఇకనైనా లేబర్ అధికారులు మేలుకొని జిల్లాలో పనిచేస్తున్న ఇటుక బట్టి కార్మికులు కావచ్చు ఇతర కార్మికులకు లేబర్ కార్డులను జారీ చేసి వారి సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఆర్మూరు సంయుక్త మండలాల నాయకులు శేఖర్, ఠాకూర్, అరవింద్, నజీర్, నిఖిల్, సిద్ధార్థ్, నితిన్, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి

- టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహా సభల్లో జిల్లా నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మహాసభలో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) రాష్ట్ర మహాసభలు నల్గొండ జిల్లా కేంద్రంలో ఈనెల 28న ప్రారంభంకాగా 30వరకు జరగనున్నాయి. ఈ సభలో నిజామాబాద్ జిల్లా టిఎస్‌యుటిఎఫ్ నాయకులు ప్రతినిధులుగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. 317 జీవో ను రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సభలో రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్, జిల్లా అధ్యక్షులు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యక్షులు మల్లేష్, కోశాధికారి రాజారాం, జిల్లా కార్యదర్శి సాయన్న, గంగాధర్, ఆనంద్, నాయకులు భుమేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చదువులకు నిలయాలు శిశుమందిరాలు

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-ఆర్మూర్



చదువులకు నిలయాలు శిశు మందిరాలు అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిరం 43వ వార్షికోత్సం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన శిశుమందిరం పూర్వవిద్యార్థుల మహా సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సరస్వతి శిశు మందిరం అంటే సాక్షాత్తు సరస్వతి అమ్మవారే కొలువై ఉన్న ప్రదేశాలు అని విద్యతో పాటు సకల కలలకు పెట్టింది పేరు అని అన్నారు. భావి భారత పౌరులకు చదువులమ్మ తల్లి ఒడిలో విద్యతో పాటు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను భోదించే ఏకైక పాఠశాలలు శిశు మందిరాలన్నారు. విద్యార్థులను కేవలం చదువుకు మాత్రమే పరిమితం చేయకుండా సమాజంలో మనుగడ సాధించేందుకు అవసరమైన జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని భోదిస్తూ విలువలతో కూడిన విద్యను అందిస్తూ జాతి వికాసంలో జాతీయ పునర్నిర్మాణం వైపు అడుగులు వేస్తున్న ఏకైక విద్యాసంస్థలు మన శిశు మందిరాలు అని ప్రశంసించారు. శిశు మందిరాలు ఏర్పడి అర్ధ శతాబ్దం (50ఏళ్ళు) అవుతున్న విద్యలో కాని విలువల్లో కాని ఎటువంటి మార్పు లేదని తెలిపారు. మొక్కగా ప్రారంభం అయి నేడు మహా వృక్షంల ఎదిగి ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టి వారిని జాతీయ పునరనిర్మాణంలో భాగస్వాములను చేయడం నిజంగా గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులకు విద్యతో పాటు శారీరక మానసిక ఉల్లాసం కోసం ఆటలు, వ్యాయామం, యోగ, సంగీతం ఉపయోగపడతా యన్నారు. క్రమ శిక్షణకు మారు పేరుగా శిశు మందిరం విద్యార్థులు నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో ఐఏఎస్, ఐపీఎస్‌లుగా బిజినెస్ మ్యాన్‌లుగా, రాజకీయ నాయకులుగా ఎందరినో ఉన్నత స్థానాలలో నిలబెట్టారన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ఉన్నత లక్ష్యం సాధించే దిశగా లక్ష్యం చేరే వరకు విశ్రమించకుండా ఉన్నత శిఖరాలను అవరోధించి ఈ దేశ పునర్నిర్మానంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల త్యాగాలతో ఏర్పడ్డ సంఘం ఎస్ఎఫ్ఐ

- జిల్లా కార్యదర్శి విగ్నేష్



మాట్లాడుతున్న విగ్నేష్

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థుల త్యాగాలతో ఏర్పడ్డ సంఘం ఎస్ఎఫ్ఐ అని జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డివిజన్ నాయకుడు శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని శాస్త్రి నగర్ ఎస్ఎఫ్ఐ ఆఫీస్ వద్ద 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ 1970 సంవత్సరంలో పురుడుపోసుకొని విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఛాంపియన్‌గా పోరాటాల నిర్వహిస్తున్న ఏకైక సంఘం అని అన్నారు. ఈ 55 సంవత్సర కాలంలో అనేక అడ్డంకులు ఎదురైన విద్యార్థులనూ ఐక్యం చేసి పోరాటాలను ముందుకు తీసుకెళుతుందని అన్నారు. దేశంలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లాంటి ఎన్నో యూనివర్సిటీల్లో ఎస్ఎఫ్ఐ విజయ ఢంకా మోగిస్తుందని తెలిపారు. దేశానికి ముప్పు లాంటి నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పోరాడుతున్నామని అన్నారు. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పి కొడుతున్నామని తెలిపారు. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే మూడు లక్ష్యాలను సాధించేవరకు ఉద్యమిస్తామని అని అన్నారు. నవ సమాజ నిర్మాణమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యా విధానంపై అడుగులు వేయాలని, విద్యారంగానికి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి విద్యారంగం అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, సంజయ్, చందు, కార్తీక్, అభినవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రైతాంగ డిమాండ్లపై చర్చలు జరపాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న ప్రభాకర్

రైతాంగం డిమాండ్లపై ప్రధానమంత్రి మోడీ మొండి వైఖరి వీడీ చర్చలు జరపాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్ అన్నారు. నగరంలోని కోటగల్లిలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ పాలనలోని మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చారిత్రాత్మక రైతు ఉద్యమంలో ప్రముఖ నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ తీవ్రమైన, ఆందోళనకరమైన ఆరోగ్య పరిస్థితిపై అఖిల భారత యునైటెడ్ కిసాన్ సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ఆయన 26 నవంబర్ 2024 నుండి శంభు సరిహద్దులో ఆమరణ నిరాహార దీక్షలో ఉన్నారని తెలిపారు. పంటలకు కనీస మద్దతు ధర, రైతు రుణాల మాఫీతో సహా రైతాంగం యొక్క న్యాయమైన, చట్టబద్ధమైన డిమాండ్లను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందన్నారు. అఖిల భారత యునైటెడ్ కిసాన్ సభతో ప్రధానమంత్రి మోడీ తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. జగ్జీత్ సింగ్ దల్లేవాల్ జీవితాన్ని రక్షించడానికి ఇది ఏకైక మార్గం అన్నారు. సమావేశంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం నిజామాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి బి. బాబన్న పాల్గొన్నారు.

టీజీబీసీఎల్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మామిడి విఠల్

నవతెలంగాణ-ధర్పల్లి



ఆర్‌కృష్ణయ్యతో మామిడి విఠల్

తెలంగాణ రాష్ట్ర బి.సి అధ్యాపకుల సంఘం(టీజీబీసీఎల్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మామిడి విఠల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆదివారం తెలిపారు. ఈనెల 25న హైదరాబాద్ లోని కాచిగూడలో జాతీయ బిసి సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సమక్షంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర బిసి అధ్యాపకుల సంఘం కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మామిడి విఠల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా విఠల్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని, అధ్యాపకుల సంఘం సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింప చేస్తానని తెలిపారు. ప్రతీ రంగంలో బిసి వాటా తేల్చేవిధంగా పోరాడుతానని, బిసిలు రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తాననీ తెలిపారు. ఈసమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకటించారని అన్నారు. రాష్ట్ర కార్యవర్గాన్ని, జిల్లా ఇన్చార్జీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలు విషయాలు చర్చించి తీర్మానాలు ప్రవేశపెట్టారని తెలిపారు. మహనీయుల జయంతులు నిర్వహించాలని, జనవరి 3న సావిత్రిబాయి పూలేతో మొదలుపెట్టాలని అన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయం

పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు సాయి కృష్ణ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు సాయి కృష్ణ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం, అన్మాస్‌పల్లి గ్రామంలో పత్రీజీ శక్తి స్థల్ మహేశ్వర మహా పిరమిడ్‌లో 11 రోజులపాటు జరుగుతున్న కార్యక్రమాలలో జిల్లా నుండి ఎక్కువ సంఖ్యలో పాల్గొని సేవలు అందించడం అభినందనీయమని పి ఎస్ ఎస్ ఎమ్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణ రెడ్డి ఆదివారం తెలిపారు. పత్రీజీ ధ్యాన మహా యజ్ఞం ధ్యాన జ్ఞాన కార్యక్రమంలో భాగంగా ఇటీవల జరిగిన ధ్యాన జ్ఞాన కార్యక్రమంలో మాజీ మంత్రి, బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించినట్టు తెలిపారు. ధ్యానులందరూ స్వచ్ఛందంగా 11 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహేశ్వర మహా పిరమిడ్ అన్నప్రసాదం, పిరమిడ్ ధ్యాన బంధువులు ఉన్న వసతి కేంద్రాలను పరిశీలించారు. జిల్లా నుండి 5వేల మంది పిరమిడ్ మాస్టార్లు విచ్చేసారని, 500 మంది ధ్యానులు ఈ కార్యక్రమంలో సేవలు అందిస్తున్నారని వివరించారు. పత్రీజీ జన్మించిన బోధన్ నిజామా బాద్ జిల్లా నుండి ఇంత పెద్ద మొత్తంలో రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సుదర్శన్ రెడ్డి అభినందించారు. నిజామాబాద్ జిల్లాలో ఏ అవసరమున్న తన సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ప్రతిరోజు ఈ ధ్యాన జ్ఞాన కార్యక్రమంలో లో వివిధ ప్రాంతాల నుండి 20వేల నుండి 30 వేల వరకు ధ్యానులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, పత్రీజీ కూతురు పరిణిత, సభ్యులు కృష్ణారెడ్డి, కూకట్‌పల్లి లక్ష్మి, బాలకృష్ణ, పూల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు

- మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

పార్టీలకు అతీతంగా, కుల మతాలకు అతీతంగా, నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు ప్రజా పరిపాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందజేస్తుందని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లు లేని వారికి, పూరి గుడిసెలో నివసించే వారికి, ఇల్లు దగ్ధమైన వారికి ఇందిరమ్మ ఇల్లు అందించాలని తెలిపారు. ఎవరైనా ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ప్రలోభాలకు గురి చేస్తే, ఎవరు కూడా ప్రలోభాలకు గురికావొద్దని, ప్రజా ప్రభుత్వంలో ప్రలోభాలకు తావులేదని పేర్కొన్నారు. నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందకుంటే, ప్రజాప్రతినిధుల దృష్టికి, అధికారుల దృష్టికి గాని తీసుకురావాలని సూచించారు. తమ లాంటి వారి దృష్టికి తీసుకువచ్చినా తాము ప్రభుత్వానికి తెలియజేసి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-దోమకొండ



దోమకొండ మాజీ సర్పంచ్ నర్సయ్య కూతురు శివాని హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో గత వారం రోజుల క్రితం మరణించడంతో బాధిత కుటుంబాలను, అలాగే యువజన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సీతారాం ప్రసాద్ శుక్రవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను కామారెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్ ఆదివారం పరామర్శించారు. మృతుని అన్న సీతారాం మధు, కుటుంబ సభ్యులను ఓదార్చి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, అబ్రబోయిన రాజు, పులబోయిన రమేష్, అబ్రబోయిన చంద్రయ్య, మడతల బసవయ్య, బంధం రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి హృదయం.. ఆనంద గీతం

- సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఉషోదయ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలకు చెందిన 2008-10 బ్యాచ్‌కు చెందిన ఇంటర్ విద్యార్థులు ఒక్కచోట చేరి చదువుకున్న రోజుల్లో ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్, అధ్యాపకులు కృష్ణ, రామ్‌చరణ్, పల్లవి, రాములు, ప్రభాకర్, సాయిలు, దేవయ్యను ఘనంగా సన్మానించారు. రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హైకోర్టు ఎజిపి లలిత, చందూ, లాల్‌సింగ్, నిఖిల్, శ్రీనివాస్, మహేష్, నందిని, అనిత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

భారత్ రోడ్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-కామారెడ్డి



ఎన్నికైన నూతన కార్యవర్గం

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని భారత్ రోడ్‌లో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులుగా సిద్దంశెట్టి రమణ గుప్తా, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సునీల్ (కుబ్బి) గుప్తా, కోశాధికారి కోడిశాల గంగాధర్ గుప్తా, కార్యవర్గ సభ్యులుగా తాటిపల్లి రమేష్ గుప్తా, కోడిశాల ప్రభాకర్ గుప్తా, కోడిప్యాక బాలాజీ గుప్తా, ముప్పిడి ప్రశాంత్ గుప్తా, తృప్తి అనీల్ గుప్తా తదితరులు సంఘం కార్యవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు.

ఇందిరమ్మ సర్వేలో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటి సర్వే గ్రామపంచాయతీ సిబ్బంది వివిధ కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ శంకర్, ఎమ్‌డీ అల్తాఫ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మని బాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగని బాలయ్య, ఎమ్‌డీ హైమద్, గాంధ్యటం సాయిలు, గ్రామపంచాయతీ సిబ్బంది మూర్తి వంశీ తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ మండలంలో నాట్లు వేస్తున్న కూలీలు

ఊపందుకున్న వరి నాట్లు

రెంజల్ మండలంతో పాటు పొతంగల్ మండలంలో వరి నాట్లు ఊపందుకున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో నాట్లను వేయిస్తున్నారు రైతులు. ఒక్కో ఎకరానికి రూ.4000 వరకు నాటు వేసేందుకు వలస కూలీలు డబ్బులు తీసుకుంటున్నారు. స్థానికంగా కూలీ రేట్లు పెరగడంతో వలస కూలీలకు గుత్తకు ఇచ్చి నాటు వేయిస్తున్నారు.

- గ్రామాలకు చేరుకున్న వలస కూలీలు
- ఒక్కో ఎకరానికి రూ.4000
- గుత్తకు తీసుకుని వరి నాట్లు

నవతెలంగాణ-రెంజల్/పొతంగల్

రెంజల్ మండలంలో యాసంగి సీజన్‌లో వరి నాట్లు వలస కూలీలతో ఊపందుకున్నాయి. మండలంలో వ్యవసాయ కూలీలు అందుబాటులో లేకపోవడంతో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి స్థానికులు వెళ్లి కూలీలను తీసుకు వచ్చి వారికి సకల సౌకర్యాలను సమకూర్చి నాట్లు వేయిస్తున్నారు. దీంతో వలస కూలీలు వారు చెప్పిన పంట వద్దకు వెళ్లి నాట్లు వేస్తున్నారు. రెంజల్ మండలంలో యాసంగి సీజన్‌లో తొమ్మిది నుంచి పదివేల ఎకరాలలో వరి నాట్లు సాగుచేస్తారని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. అయితే ప్రస్తుతం సుమారు 7 వేల ఎకరాల్లో వరి నాట్లను రైతులు వేశారు. అయితే నాటు వేసేందుకు గానూ స్థానిక రైతులు వలస కూలీలకు అప్పజెప్పుతున్నారు.

స్థానిక కూలీలు 4,500 నుంచి 5000 రూపాయల వరకు పనిచేస్తూ ఉండగా, వలస కూలీలు ఒక్కో ఎకరం రూ.4వేలకు గుత్తకు తీసుకుని నాట్లు వేయడంతో స్థానిక రైతులు వలస కూలీలకే మొగ్గుచూపుతున్నారు. అయితే వలస కూలీలు రోజుకు 5ఎకరాల నుంచి పది ఎకరాల వరకు వరినాట్లను వేస్తున్నారు. ఈ కూలీలకు రైతులు తమ పొలాలను దమ్ము చేసి రడీగా ఉంచడంతో వారు రావడంతోనే గ్రూపులుగా ఏర్పడి నాట్లు వేస్తున్నారు. ఉదయం ఐదు గంటలకే వారు పొలాల్లోకి వెళ్తారు. వారిలో ఒకరు వంటలు సిద్ధం చేసుకుని కూలీలకు కోసం తీసుకుని వెళ్తారు. ఏ రైతుకైతే కూలీల అవసరం ఉందో ఆ రైతు వలస కూలీలను తమ ట్రాక్టర్ ద్వారా పొలం వద్ద దింపేస్తారు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఇలాగే వలస కూలీలచే రైతులు వారి నాట్లను వేయిస్తున్నారు.

పొతంగల్ : మండలంలో పలు గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. నిజాంసాగర్ నీటిని విడుదల చేయడంతో ఆ ఆయకట్టు కింద రైతులు పొలాలను నాటుతున్నారు. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా మారారు. నాట్లు వేసేందుకు గానూ బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూలీలు రావడంతో రైతులు వారితో నాట్లు వేయిస్తున్నారు.



పొతంగల్ : నాట్లు వేస్తున్న కూలీలు



రెంజల్ : వంట చేసుకుంటున్న వలస కూలీ

తెలుగు మహాసభలకు ఉపాధ్యాయులు

నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లాకు చెందిన తెలుగు పండిత్ ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కేవీఎస్ కళాశాలలో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలకు శనివారం బయలుదేరారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతినిధులు గాండ్ల నర్సింలు మాట్లాడుతూ.. శనివారం, ఆదివారం రెండు రోజులలో 25కు పైగా కవిత, సాహిత్య సమ్మేళనాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సభలకు ఎమ్మెల్యే విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజన చౌదరి, కార్యక్రమం నిర్వహణ అధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్, సభల ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్, తెలంగాణ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మార్గదర్శి ఎండి శైలజ కిరణ్, సుప్రీంకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ, సినీ గేయ రచయిత భువనచంద్ర, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, వివిధ దేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. యువ కవి సమ్మేళనాలు, అచ్చ తెలుగు అష్టావధానాలు, పద్య, వచన, గేయ శిక్షణ కార్యక్రమాలు మార్పు గ్రంథావిష్కరణ, కవులు కళాకారులు విద్యార్థులు రాజకీయ నాయకులు, దాదాపు 2 వేల మంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

శబరిమలై బయలుదేరిన అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-లింగంపేట్

అయ్యప్ప మాల ధరించిన స్వాములు ఆదివారం ఇరుముడి కట్టుకొని శబరిమలై బయలుదేరారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు అయ్యప్ప మాల ధరించారు. 40 రోజులపాటు నియమ నిబంధనలు పాటించారు. మండల కేంద్రంలోని ఉత్తర శబరిమల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఇరుముడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తర శబరిమల అయ్యప్ప ఆలయం నుంచి జంబి హనుమాన్ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. శబరిమలై బయలుదేరి అయ్యప్ప స్వాములకు ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో స్వాములు, చంద్రమౌళి, రవిగౌడ్, శ్రీకాంత్, నగేష్, గౌతమ్, సంతోష్‌గౌడ్, సిద్ధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు రిమాండ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఆబేద్ హుస్సేన్ ఈనెల 19న తన బంధువుల ఇంటికి హైదరాబాద్‌కు వెళ్లాడు. 20 న తన ఏటీఎం నుంచి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు డ్రా చేసినట్లుగా అతనికి మెసేజ్ వచ్చింది. దీంతో ఎల్లారెడ్డిలోని తన ఇంటికి వచ్చి చూడగా ఇంటికి గల తలుపులు పగులగొట్టి, ఇంట్లోని బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. బీరువాలోని కొంత నగదు, ఏటీఎం కార్డు దొంగిలించినట్టు గుర్తించారు. ఏటీఎం కార్డు ఉపయోగించి దొంగలు కొంత డబ్బులు డ్రా చేశారు. దీంతో బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరి వ్యక్తులను పట్టుకున్నారు. వీరిలో ఒకరు గతంలో కొన్ని దొంగతనాల్లో, మర్డర్ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. మెదక్ జిల్లాలోని తొగిట గ్రామానికి చెందిన మావబోయిన మహేష్, అతనితోపాటు లింగంపేట్ మండలంలోని లొంకలపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య అనే వ్యక్తిని పట్టుకుని విచారించగా.. వారు దొంగతనం ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు వీరిని రిమాండ్‌కు తరలించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ధూంధాం

- కోలాటాలు నృత్యంతో నిరసన
- సీఎం హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె నిరసనలో గా 20వ రోజు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సమగ్ర శిక్ష ఉద్యోగుల ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రోడ్డుపైన కోలాటాలు,నృత్యాలు, అసైదుల ఆటలతో మున్సిపల్ కార్యాలయం వద్ద ధూమ్ దాం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ తాము చేస్తున్న పోరాటం లో ఏ రాజకీయ నాయకులు లేరని సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరాటం స్వశక్తిదన్నారు. ఇది దశాబ్దాల బానిసత్వానికి విముక్తి పొందడానికి చేస్తున్న ఆరాటమని అని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వం కొంత సానుకూలత చూపించినప్పటికీ స్పష్టమైన స్పందన లేదని ఇప్పటికే విద్యా బోధన బంద్ చేసి రోడ్డు ఎక్కినామని మహిళల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. మా పోరాటం శాంతియుతంగా చేస్తున్నామని రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చకుంటే విద్యా వ్యవస్థలో విద్యార్థులకు జరిగే నష్టానికి ప్రభుత్వమే బాధ్యతని గుర్తు చేశారు. ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సిపియాస్ సంఘం జిల్లా నాయకులు ఎల్లారెడ్డి భాస్కర్ రెడ్డి , టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమల్ రెడ్డి ఇన్నారెడ్డి వచ్చి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకుమీ వెంట ఉంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి,నాయకులు రాములు, శైలజ,సంతోష్ రెడ్డి, వనజ,మంగా, శ్రీవాణి,శ్రీను,కాళిదాసు, కళ్యాణ్,, లింగం, దినేష్, లావణ్య 500 మంది సభ్యులు పాదయాత్రలో పాల్గొన్నారు.

వార్డ్ కౌన్సిలర్‌కు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 47వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ గడిచిన గత 5 సంవత్సరాలుగా వార్డు ప్రజలకు 24 గంటలు నిరంతరాయంగా అందుబాటులో ఉంటూ సేవలు అందించారని ఆదివారం భారత్ రోడ్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ఇలాగే మున్ముందు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తీరుస్తూ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో భారత్ రోడ్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిద్దంశెట్టి రమణ గుప్తా, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సునీల్ (కుబ్బి) గుప్తా, కోశాధికారి కోడిశాల గంగాధర్ గుప్తా, కార్యవర్గ సభ్యులు తాటిపల్లి రమేష్ గుప్తా, కోడిశాల ప్రభాకర్ గుప్తా, కోడిప్యాక బాలాజీ గుప్తా, ముప్పిడి ప్రశాంత్ గుప్తా, తృప్తి అనిల్ గుప్తాతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తే ఆగ్రహానికి గురికాక తప్పదు

- బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్

నవతెలంగాణ-బోధన్ టౌన్



మాట్లాడుతున్న మల్లేష్

బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే కార్మికులు ఆగ్రహానికి గురికాక తప్పదని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ అన్నారు. ఆదివారం పట్టణంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో బీడీ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లో బీడీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తామని హామీనిచ్చి సంవత్సరం గడుస్తున్నా అమలు చేయకపోవడంతో బీడీ కార్మికులందరూ మళ్లీ మోసగించబడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవించే ప్రతి ఒక్కరికీ రూ.4వేలు జీవన భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకులు భాగ్య, లక్ష్మి, టియుసిఐ జిల్లా కమిటీ నాయకురాలు రెహానా బేగం, పిఓడబ్ల్యు జిల్లా నాయకురాలు బీపాషా బేగం, పిడిఎస్‌యు జిల్లా నాయకురాలు ఎస్.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఏఐఎఫ్‌డీడబ్ల్యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అంగడి పుష్ప, వంగాల రాధా సుధా అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు హాజరై మాట్లాడారు. ఈ సమావేశాన్ని కామ్రేడ్ నీలా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అంగడి పుష్ప, వంగాల రాధా సుధా మాట్లాడుతూ.. మహిళలపై అనేక రకాలుగా ఘటనలు జరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికే మహిళలకు రక్షణ కరువై అనేక విధాలుగా హింసకు, లైంగికదాడులకు గురవుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, విద్యాసంస్థలకు దగ్గర్లో బెల్ట్ షాపులు తెరిచి మద్యం ఏరులై పారుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, ఉచిత బస్సుల పేరుతో 3000 బస్సులను తీసివేశారని దీంతో మహిళలకు ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని వదిలి వారి స్వలాభం కోసం రాజకీయం చేయడం సరికాదన్నారు. ఇప్పటికీ వితంతు వికలాంగ పెన్షన్లు, అలాగే వృద్ధాప్య పెన్షన్లు ఇప్పటివరకు పెంచినటువంటి పెన్షన్లను ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. అన్ని సమస్యలపైన రాబోయే రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పుష్ప, జిల్లా కన్వీనర్ మాలోత్ అర్చన, జిల్లా కమిటీ సభ్యులు నీలా సుజాత, బట్టు లక్ష్మి, సత్యవా, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ గంజాయి తీసుకున్నా, అనుమతి లేని ప్రదేశాలో మద్యం తాగినా.. కఠిన చర్యలు

- కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయకుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 31న ఆ తర్వాత కానీ డ్రగ్స్, గంజాయి సేవించినా, అనుమతి లేని ప్రదేశాలో మద్యం తాగినా, హోటల్స్‌లో, దాబాల్లో, పబ్లిక్ ప్రదేశాలలో మద్యం తాగినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా ఎవరైనా నూతన సంవత్సర వేడుకలను ఫంక్షన్ హాల్‌లో నిర్వహించుకోవాలనుకుంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని తీసుకు రావొద్దని, వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎక్సైజ్ కామారెడ్డి జిల్లా నుంచి 4 ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కేసుల్లో పట్టుబడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమర శంఖారావం గోడప్రతుల ఆవిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి

జనవరి 8న ఇందిరా పార్క్ వద్ద జరిగే బీసీ విద్యార్థుల సమర శంఖారావం గోడప్రతులను జిల్లా కేంద్రంలో బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారుగా రూ.4,500 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ స్కాలర్షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఏ విధంగా అయితే స్కాలర్‌షిప్ విడుదల చేస్తున్నారో బీసీ విద్యార్థులకు కూడా ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. బీసీ గురుకులకు, సంక్షేమ వసతి గృహాలలో సొంత భవనాలు నిర్మించాలని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఫీజుల సమస్యలు, సంక్షేమ వసతి గృహాల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం పెద్దఎత్తున తరలివచ్చి బీసీ విద్యార్థుల సమర శంఖారావాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనంతుల సాయిగౌడ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు శ్రీనివాస్, హరి, వెంకటేష్, ప్రసాద్, రమేష్, అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నారంలో గుట్ట మల్లన్న జాతర

నవతెలంగాణ-రామారెడ్డి



మండ లంలోని అన్నారం గ్రామంలో గుట్ట మల్లన్న జాతరను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మల్లన్నకు గ్రామస్తులు గండ దీపం, బోనాలు సమర్పించి మొక్క లు తీర్చుకున్నారు. ఎడ్లబండ్ల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.